


సీఎంను కలిసిన కొమ్మాలపాటి



నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో పలు అంశాలపై ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు.

69 పంచాయతీలకు విలీన గ్రహణం

కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను రాష్ట్రప్రభుత్వం బుధవారం పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. అయితే ఉమ్మడి జిల్లాల్లో 69 పంచాయతీలకు ఆ నిధులు జమ కాలేదు. ఆయా పంచా యతీలలో ఎన్నికలు జరగకపో వడంతో కేంద్రప్రభుత్వం నిధులను నిలిపివేసింది. ఆ పంచాయతీలకు రెండు విడతల్లో ఒక్క రూపాయీ జమ కాలేదు. ఒక్కో పంచాయతీ రూ. లక్షల్లో నిధులను కోల్పోయింది. ఫలితంగా ప్రగతి మాట ఎలా ఉన్నా కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి ఆయా పంచాయతీల్లో నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్నికలు జరగని పంచాయతీలు రెండు విడతల్లో దాదాపు రూ. 7.5 కోట్ల వరకు నిధులను కోల్పోయాయి.



- నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు
- ఎన్నికలు జరగక పోవడంతో నిలిపివేత
- ఒక్కో పంచాయతీకి రూ. లక్షల్లో చేజారిన నిధులు

చేజారిన రూ.7.5 కోట్ల నిధులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులను కేంద్రప్రభుత్వం స్థానిక సంస్థలకు విడుదల చేస్తుంది. పాలక వర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధన విధించింది. ఆర్థిక సంఘం నిధులను తాగునీటి సరఫరాకు, పారిశుధ్య పనులకు ఎక్కువ శాతం కేటాయిస్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయా పంచాయతీలను మునిసిపాలిటీల్లో విలీనం చేశారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు. అధికార బలంతో వైసీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి వారికి అనుకూలంగా ఆయా పంచాయతీలను మునిసిపాలిటీల్లో విలీనం చేశారు. నరసరావుపేట మునిసిపాలిటీలో ఇసప్పాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేసానుపల్లి పంచాయతీల పరిధిలోని కొంత ప్రాంతాన్ని విలీనం చేయగా.. పొన్నూరు మునిసిపాలిటీలో చింతలపూడి, కసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెద ఇటికంపాడు, వడ్డెముక్కల పంచాయతీలను విలీనం చేశారు. బాపట్ల మునిసిపాలిటీలో అడవి, అడవివారిపాలెం, (మిగతా 4వ పేజీలో)

అయా పంచాయతీలకు అధికారుల ఏలుబడి కొనసాగుతుండటంతో ప్రజా సమస్యలు పరి ష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. గత ఏడాది అక్టోబరులో 15వ ఆర్థికసంఘం నిధులు పంచాయతీలకు జమ అయ్యాయి. రెండో విడత నిధులు బుధవారం విడుదలయ్యాయి. ఈ రెండు విడతల్లో అయా పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన సూమారు 7.5 కోట్లు ఆర్థిక సంఘం నిధులు కోల్పోయినట్లు అధికారుల అంచనా వేశారు. ఈ నిధులు సమకూరి ఉంటే అయా పంచాయతీల్లో చాలా వరకు రహదారులు, కాలు వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించక పోవడం పంచాయతీల ఆర్థిక అవకాశాలను దెబ్బతిసింది.

పిడుగురాళ్లలో.. నాలుగు రైళ్లకు స్టాప్

- నరసరావుపేట ఎంపీ విజ్ఞప్తికి రైల్వే బోర్డు సానుకూల స్పందన

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో నరసాపూర్, డెల్టా ఎక్స్‌ప్రెస్‌లకు నిలుపుదల సౌకర్యం కల్పించేందుకు రైల్వేబోర్డు సానుకూలంగా స్పందించినట్లు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దీని వలన పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల ప్రయాణీకులకు మేలు జరుగుతుందన్నారు. త్వరలోనే రైల్వే శాఖ నుంచి ఆయా రైళ్లు ఏ తేదీల నుంచి పిడుగురాళ్లలో నిలుపుదల సౌకర్యం కల్పించిందన్న విషయం వెలువడుతుందని చెప్పారు.



నంబరు. 17255 నరసాపూర్ - లింగంపల్లి, నంబరు. 17256 లింగంపల్లి - నరసాపూర్, నంబరు. 17625 కాచిగూడ - రేపల్లె, 17626 రేపల్లె - వికారాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్‌లకు పిడుగురాళ్లలో కోవిడ్‌కి ముందు వరకు నిలుపుదల ఉండేది. కోవిడ్ తర్వాత ఈ నాలుగు రైళ్లకు స్టాపేజ్ సదుపాయాన్ని రైల్వే శాఖ తొలగించింది. దీనిపై నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పట్టువదలకుండా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వేబోర్డు ఛైర్మన్, దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధికారులతో చర్చలు జరిపి ఒప్పించారు. త్వరలోనే నరసపూర్-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ పిడుగురాళ్లకు అర్ధరాత్రి 12.20కి చేరి 12.21కి బయలుదేరుతుంది. లింగంపల్లి - నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి 12.40కి చేరి 12.41కి, కాచిగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి 2.10కి వచ్చి 2.11కి, రేపల్లె - వికారాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి 1.20కి వచ్చి 1.21కి బయలుదేరేలా సమయ పట్టికని సవరించేందుకు రైల్వే శాఖ సమమ్మతించిందని ఎంపీ తెలిపారు.

ఎరువులు సరిహద్దులు దాటిస్తే క్రిమినల్ కేసులు

- విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్

గుంటూరు సిటీ, దాచేపల్లి,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఎరువులను సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రానికి తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ డీ సూర్యశ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పొందుగుల బ్రిడ్జి సమీపంలో ఈ నెల 2వ తేదీన స్వాధీనం చేసుకున్న యూరియా వివరాలను ఆయన వెల్లడించారు. ఒక ఆటోలో ఎలాంటి బిల్లు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 14 ఎరువుల బస్తాలను పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తెలంగాణ లోని దామరచర్ల మండలానికి చెందిన పులి పిచ్చియ్య, భూక్యా రవి, మరో బాలుడు ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా యూరియా తరలిస్తున్నందున కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులకు గురజాల కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో ఎవరైనా అక్రమంగా ఎరువులను ఎక్కువ ధరలకు అమ్మడం గాని, ఇతర రాష్ట్రాలకు రవాణా చేయడం గాని, యూరియా అందుబాటులో ఉండి కుడా కృత్రిమ కొరతని సృష్టించటం కూడా నేరమన్నారు.అలాంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పొందుగల వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎరువులు

ఒకే రోజు.. 300 మందికి

రేషన్ అంట..!

- మతలబు అంతా.. పోర్టబిలిటీలోనే..
- ఈ నెల ఇప్పటి వరకు జరిగిన రేషన్ పంపిణీలో 45 శాతం పోర్టబిలిటీ



గుంటూరు,సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అనుమతిస్తోన్న పోర్టబిలిటీ (ఎవరు ఏ షాపులోనైనా సరుకులు తీసుకొనే) సదుపాయం జిల్లాలో పక్క దారి పడుతోన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వలన చాలా దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభించిన మూడు, నాలుగు రోజుల్లోనే నో స్టాకు బోర్డులు వెలుస్తోన్నా యి. దీంతో రేషన్ సరుకులు ఏ డిపోకి వెళ్లి తీసుకోవాలో తెలియని పరిస్థితి తలెత్తుతోంది. సాధారణంగా వలస కార్మికులు, చిరునామాలు మారిన వాళ్లు 10 నుంచి 20 శాతం మంది ఉంటారు. వాళ్లు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ప్రభుత్వం పోర్టబిలిటీ తీసుకొస్తే 45 శాతం పైగా పోర్టబిలిటీ లావాదేవీలు జరిపి సరుకులను డీలర్లు దారి మళ్లించేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్ కావడంతో ప్రస్తుత సెప్టెంబరు నెలలో చాలామంది డీలర్లు పోర్టబిలిటీ ఇవ్వడం లేదు.

ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో రేషన్ సరుకుల పంపిణీలో పోర్టబిలిటీని తీసుకొచ్చింది. ముఖ్యంగా పనుల కోసం గ్రామాల నుంచి ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలస వస్తుంటారు. వాళ్లు ప్రతీ నెలా స్వగ్రామానికి వెళ్లి రేషన్ తీసుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసలకోర్చాల్సి ఉంటుంది. అలానే ఇంటి అద్దెలు పెచ్చుగా ఉన్నాయని నగరం/ పట్టణంలోనూ మారుమూల కాలనీలకు నివాసాలను మారుస్తుంటారు. వాళ్లు కూడా నాలుగైదు కిలోమీటర్ల దూరం ప్రయాణించి రేషన్ సరుకులు తీసుకోవాలంటే కష్టమే. అలానే ఒన్ నేషన్ ఒన్ రేషన్‌కార్డు విధానం కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. ఈ విధానంలో దేశంలోని ఏ రాష్ట్రానికి చెందిన లబ్ధిదారుడైనా తాను నివాసం ఉంటున్న ప్రాంతంలో రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు పొందవచ్చు. అయితే ఈ పోర్టబిలిటీని చాలామంది డీలర్లు పక్కదారి పట్టించేస్తున్నారు. ఈ-పోస్ యంత్రం తీసుకొని రేషన్ బియ్యం అవసరం లేని కుటుంబాల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకొని అందుకు ప్రతిఫలంగా నగదు చేతిలో పెడుతున్నారు. ఆ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కి తరలించి సొమ్ము చేసుకొంటున్నారు.

గుంటూరు జిల్లాలో 5 లక్షల 88 వేల 693 కార్డులున్నాయి. గురువారం(ఈ నెల 4వ తేదీ) సాయంత్రం వరకు 2,69,919 మంది సరుకులు తీసుకొన్నారు. ఇందులో పోర్టబిలిటీలో 1,23,588(45 శాతం)మంది సరుకులు తీసుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోన్నది. బాపట్ల జిల్లాలో 2,53,537 మంది సరుకులు తీసుకోగా పోర్టబిలిటీలో 79,998 (31.55 శాతం) మంది తీసుకొన్నారు. బాపట్ల జిల్లాలో పోర్టబిలిటీ శాతం గుంటూరుతో పోల్చితే తక్కువగానే ఉన్నది. పల్నాడు (మిగతా 4వ పేజీలో)

30 బార్లకు మళ్లీ నోటిఫికేషన్

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి), పల్నాడు జిల్లాలో ఒక్కరు కూడా అప్లికేషన్ దాఖలు చేయని 30 బార్లకు రీ నోటిఫికేషన్ గజిట్ విడుదల చేసినట్లు పల్నాడు జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ గురువారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని తెలిపారు. ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్‌లో లాటరీ తీస్తామని ఆయన తెలిపారు. నరసరావుపేట మున్సిపాలిటీలో 8, చిలకలూరిపేట మున్సిపాలిటీలో 7, పిడుగురాళ్ల మున్సిపాలిటీలో 6, మాచర్ల మున్సిపాలిటీలో 3, వినుకొండ మున్సిపాలిటీలో 6 మొత్తం 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు.

యూరియా సరఫరా సమస్యలపై కంట్రోల్ రూం ఏర్పాటు

8332066633కు సమస్యలు తెలియజేయండి : కలెక్టర్



నరసరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా సరఫరాను మెరుగుపరిచేందుకు వ్యవసాయశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గురువారం తెలిపారు. యూరియా సరఫరాలో సమస్యలున్నా, అక్ర మాలు జరిగినా 8332066633 నెంబరుకు ఫోన్ చేసి అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. యూరియా అక్రమాలపై జిల్లా అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. పొందుగల చెక్ పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా యూరియాను తెలంగాణకు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టు లో ప్రవేశ పెట్టగా కోర్టు వారికి 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. ఎరువులకు సంబంధించిన అంశంలో అక్రమాలకు పాల్ప డితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తమ వ్యక్తిగత వాహనాలను ఇతరులు ఎరువుల రవాణాకు వినియోగించకుండా జాగ్రత్త పడాలని ప్రజలకు కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు.

పిడుగురాళ్లలో పెరుగుతున్న జ్వరాలు

- వైరల్ లక్షణాలతో ఆసుపత్రులు కిటకిట
- పీహెచ్‌సీలలో మందుల కొరత

పిడుగురాళ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ మంది జలుబు, ఒంటి నొప్పులు, జ్వరాలతో చికిత్సకు ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. మరికొంత మంది స్థానికంగా ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతూ మందులతో గడిపేస్తున్నారు. ఒకరోజు వ్యవధిలోనే జ్వరతీవ్రత పెరిగిపోయి ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలతో పాటు గురజాల, దాచేపల్లిలో కూడా కనిపిస్తుంది.



ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం

ఒళ్లంతా నొప్పులతో..

పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఒక్క రాత్రిలోనే జలుబు, జ్వరం ఎక్కువైంది. తెల్లారేసరికి ఒంటి నొప్పులతో కదలలేని స్థితిలో స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందాడు. ఇలా ఒకరిద్దరు కాదు, అన్ని చోట్ల సీజనల్ వ్యాధులతో ఎక్కువ మంది అనారోగ్యానికి గురవుతూ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టెస్టుల పేరుతో వేలల్లో ఖర్చు

ప్రైవేటు వైద్యశాలకు వెళ్తే టెస్టుల పేరుతో ఖర్చుల బిల్లును చేతుల్లో పెడుతున్నారు. ప్రస్తుత జ్వరానికి మందులతో ఇంటివద్దనే చికిత్స పొందితే సరిపోయే రోగికి ఆసుపత్రిలో అడ్మిట్ కావాలని, లేకుంటే డెంగీ, మలేరియా వ్యాధుల సోకే ప్రమాదం ఉందని భయ పెడుతున్నారు.

ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీజనల్ వ్యాధులను పరీక్షించే మలేరియా, డెంగీ పరీక్ష కిట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. జ్వరంతో వెళ్లిన వారికి డోలో 650, పారాసిట్మాల్ బిల్లులు చేతిలో పెట్టి పంపిస్తున్నారు. గత కొద్ది రోజులుగా సచివాలయాలలో పనిచేసే ఏఎన్ఎంల వద్ద కూడా మందుల కొరత ఏర్పడింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే సరఫరా కాలేదని, అక్కడకు వస్తేనే సచివాలయాల ఏఎన్ఎంలకు అందుతాయని జ్వర పీడితులకు చెప్పి పంపిస్తున్నారు.

సర్దుబాటు చేయరూ..!

- మాతృశాఖలో చేర్చాలంటూ వేడుకోళ్లు
- నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకపోవడమే కారణం

సచివాలయ ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్న డిమాండ్

పాలనా వ్యవస్థలో ఆరో వేలుగా ముద్రపడిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉంది. జాబ్ చార్టు లేని ఉద్యోగం కావడంతో బండెడు చాకిరీ చేయాల్సిన పరిస్థితి ఉందంటూ వాపోతున్నారు. ఇటు శాఖాపరమైన విధులు, అటు సచివాలయ విధులు వెరసి వారి పని తడిసి మోపెడు అవుతోంది. ఈ నేపథ్యం లో వారు కొత్త డిమాండును తెరమీదకు తెచ్చారు.



గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలను పూర్వపక్షం చేస్తూ, వాటికి సమాంతరంగా నడిచే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను గత ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 13వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఇప్పుడు ఆ ఉద్యోగులే గ్రామ, వార్డు సచివాలయాలను రద్దు చేసి ఉద్యోగులను మాతృశాఖల్లోకి పంపించాలని, అదనంగా ఉద్యోగులను ఇతర ప్రభుత్వ విభాగాల్లోని ఖాళీల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ద్వితీయశ్రేణి ఉద్యోగుల్లా పరిస్థితి

సచివాలయ వ్యవస్థ ఏర్పడి ఆరు సంవత్సరాలు కావస్తున్నా ప్రభుత్వ పరిధిలోని కొందరు అధికారులు, కొందరు సీనియర్ ఉద్యోగులలో, సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులు అంటే (మిగతా 4వ పేజీలో)

ఇంక్రిమెంట్లు నిల్..

సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మం జూరు చేయడం లేదు. ప్రొబేషన్ ఆలస్యం అయిన కాలానికి బకాయిల చెల్లింపులు గురించి పట్టించుకోవడం గానీ, రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయడం, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం ఆరు సంవత్సరాల స్పెషల్ ఇంక్రిమెంట్, పదోన్నతులు వంటి ఎన్నో రకాల డిమాండ్లు ఇప్పటికీ డిమాండ్లుగానే మిగిలిపోయాయి. వీటన్నింటికంటే ముఖ్యమైన డిమాండ్ తమను మాతృ శాఖల్లో విలీనం చేయమని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గురువుకు పట్టం

- ప్రొఫెసర్ల విభాగంలోనూ ముగ్గురికి చోటు
- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురి ఎంపిక
- జిల్లా స్థాయిలో 33 మంది టీచర్లకు దక్కనున్న సత్కారం
- నేడు టీచర్స్ డే సందర్భంగా అవార్డుల అందజేత

6

రైతులకు తీరని ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం రాష్ట్ర రైతులను అనేక విషయాలలో దారుణంగా మోసం చేసిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలను రైతు బాధిత కేంద్రాలుగా మార్చి, చిన్నచిన్న అవసరాలకు కూడా రైతులను యాచించే స్థితికి తీసుకొచ్చారని ఆయన మండిపడ్డారు. రైతులకు న్యాయంగా దక్కాల్సిన విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు, టార్పాలిన్లను వైసీపీ నేతలు దారి మళ్లించి సొమ్ము చేసుకున్నా జగన్ ఏనాడు నోరెత్తలేదని విమర్శించారు. ధరల స్థిరీకరణ నిధి పేరుతో రైతుల్ని వంచించింది, రీసర్వే పేరుతో రైతులకు భూసమస్యలు తీసుకొచ్చింది జగన్ కాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం సకాలంలో రైతులకు ఎరువులు అందించిందన్న జగన్ మాటలు పచ్చి అబద్ధాలని పేర్కొన్నారు. ఆనాడు కట్ట యూరియా కోసం రైతులు వైసీపీ నేతల్ని బతిమాలుకుంటూ, ఆర్బీకేల వద్ద పడిగాపులు కాశారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతుల్ని మోసగించి, ఆఖరికి వారికి చెల్లించాల్సిన డబ్బులు బకాయి పెడితే, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1,674 కోట్లు జమచేసిందని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఎంపికైన వారి వివరాలను ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యామండలి గురువారం ప్రకటించింది. సాంకేతిక విద్యా విభాగం నుంచి నల్లపాడు ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఆర్ ప్రకాశ్ రావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, డాక్టర్ సీహెచ్ మోసెస్ అరవింద్ ఉత్తమ అధ్యాక అవార్డులకు ఎంపికయ్యారు. అదేవిధంగా ఉన్నత విద్యా విభాగం నుంచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ. గుజ్జు చెన్నారెడ్డి (డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్), ప్రొ. పీపీఎస్ పవన్ కుమార్ (డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్), ప్రొ. దివ్య తేజోమూర్తి వలసాని (డిపార్ట్మెంట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్), అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ పొడ (డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ), ప్రొ. ఆర్ రమేష్ రాజు (డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ) తదితరులు ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఎంపికయ్యారు.

వర్సిటీలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



వివిధ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన బాలికలు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల నాలుగో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గురువారం ఉత్సాహభరితంగా సాగాయి. క్రీడాకారులు పోటీలలో తమ క్రీడా కౌశల్యాన్ని చూపారు. ఏకలవ్య ఆదర్శ పాఠశాలల సంయుక్త కార్యదర్శి ప్రసాద్, అసిస్టెంట్ కార్యదర్శి హరి, ఈఎంఆర్ఎస్ కన్సల్టెంట్స్ కృష్ణారావు, రంగారావు, క్రీడాధికారి శ్యామసుందర్రావు, గురుకులం అధికారులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు. తొలి దశ క్రీడల్లో భాగంగా బాలికలకు పోటీలు శుక్రవారంతో ముగియనున్నాయి.

నిబద్ధత కలిగిన పోలీసు అధికారి ఉమేష్‌చంద్ర

మంత్రి మనోహర్



ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి, ఉమేష్‌చంద్ర సతీమణి కలెక్టర్ నాగరాణి

తెనాలి క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర తన బాధ్యతలను సమాజం పట్ల ఎంతో నిబద్ధతతో కొనసాగించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నక్సల్స్ కాల్పుల్లో అశువులు బాసిన ఉమేష్‌చంద్ర ఐపీఎస్ అధికారిగా తక్కువ కాలం పనిచేసినా పోలీసు శాఖలోను, సమాజంలోను కలకాలం గుర్తిండిపోయే విధంగా ఆదర్శవంతంగా నిలిచారన్నారు. కడప ప్రాంతంలో ఫ్యాక్షనిజాన్ని, కరీంనగర్ అడ్డాగా సాగిన నక్సలిజాన్ని అణిచివేయడంలో ఆయన చూపిన పోరాట పటిమ ఇప్పటికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పోలీసుశాఖకు ఉమేష్‌చంద్ర ఒక ప్రేరణ అన్నారు. నక్సలిజం, ఫ్యాక్షనిజంపై ఉక్కుపాదం మోపడంలో ఆనాడు ఆయన కీలక భూమిక పోషించారని, జనజాగృతి అనే సేవా సంస్థను ఏర్పాటు చేసి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో ప్రజలలో చైతన్యం నింపారని గుర్తు చేశారు. ఉమేష్‌చంద్ర ఇక్కడి వాసి కావడం మనందరికీ గర్వకారణం అని ఆలపాటి కొనియాడారు. తదనంతరం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ స్వర్గీయ ఉమేష్‌చంద్ర సతీమణి చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వృత్తికి, సమాజానికి అంకితభావంతో ఉమేష్ చంద్ర చేసిన సేవలను వివిధ రూపాల్లో ఎప్పటికీ కొనసాగిస్తూనే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, డీఎస్పీ జనార్ధనరావు, పట్టణ సీఐలు, ఎస్‌ఐలు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

నీటితో కళకళలాడుతున్న టెయిల్‌పాండ్



రెంటచింతల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ నీటితో కళకళలాడు తోంది. విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకుగానూ 3 గేట్లను 1.5 మీటర్లు, 1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి 25,492 క్యూసెక్కుల నీటిని, టేల్‌రేస్ చానల్ ద్వారా 8,600 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 10,916 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్లమేర నీరుందని, ఇది 7,080 టీఎంసీలకు సమానమని చెప్పారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 587 అడుగులుగా ఉంది. ఇది 305.50 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,190 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,820 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 53,210 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లోగా 1,97,238 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అధికారంలో ఉండగా రైతులను గాలికొదిలేసి ఇప్పుడు మొసలి కన్నీరు

● జగన్‌పై డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం ధ్వజం

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసిన మాజీ సీఎం జగన్ ఇప్పుడు రైతుల సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు ధ్వజమెత్తారు. గుంటూరులోని డీసీఎమ్ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ తన ఇన్‌స్టాలో రైతులకు యూరియా కొరత ఉందంటూ ఫేక్ వీడియోలతో మోసపూరిత ప్రకటనలు చేయటం సరికాద న్నారు. ఏదో అభూత కల్పనలు సృష్టించి రాష్ట్రంలో రైతులను ఇబ్బందులకు గురిచేయాలని చూసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం జగన్ తమ హయాంలో రైతులకు 12 లక్షల టన్నుల యూరియాను రైతులకు అందిస్తే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం 15 లక్షల టన్నుల యూరియాను అందిం చిందని హరిబాబు నాయుడు స్పష్టం చేశారు.

ఒకే రోజు.. 300 మందికి రేషన్ అంట..!

(3వ పేజీ తరువాయి)

జిల్లాలో 3,71,876 మంది రేషన్ తీసుకోగా పోర్టబిలిటీలో 1,43,132(38.48 శాతం) మంది తీసుకొన్నారు. మొత్తంగా గుంటూరు జిల్లాలోనే ఎక్కువగా పోర్టబిలిటీ దుర్వినియోగం జరుగుతోన్నది. ఒక్కో రేషన్ షాపులో రోజుకు 300లకు పైగా కార్డులకు సరుకులు పంపిణీ చేస్తుండటం పైనా అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఒక వ్యక్తి రేషన్ తీసుకోవాలంటే కనీసం నాలుగైదు నిమిషాల సమయం పడుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే గంటకు 15 మంది సరుకులు తీసుకోగలరు. ఈ లెక్కన నిర్విరామంగా రోజుకు 12 గంటల పాటు సరుకులు పంపిణీ చేసినా 180 మందికి మించి ఇవ్వలేరని విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కచ్చితంగా ఈ-పోస్ యంత్రాలను కార్డుదారుల ఇళ్ల వద్దకు తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకొని సరుకులు దారి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

69 పంచాయతీలకు విలీన గ్రహణం..!

(3వ పేజీ తరువాయి)

ఈస్ట్ బాపట్ల, కొండబట్లవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్నిబోయిన వారిపాలెం, పోతురా జకొత్తపాలెం, తూర్పు పిన్నబోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీనం చేయగా.. చిలకలూరిపేట మునిసిపాలిటీలో దండమూడి పంచాయతీని, గుంటూరు కార్పోరేషన్‌లో చినపలకలూరు, లాలాపురం పంచాయతీలను విలీనం చేశారు. మంగళగిరి మునిసిపాలిటీలో ఆత్మకూరు, బేతపూడి, చిన కాకాని, చిన వడ్లపూడి, కాజ, కాశివారి పాలెం, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రా పురం, యర్రబాలెం పంచాయతీలను విలీనం చేయగా.. తాడేపల్లి మునిసిపాలిటీలో చిర్రావూరు, గుడిమెడ, ఇప్పటం, కొలనుకొండ, మెల్లంపూడి, పెనుమాక, ప్రతురు, ఉండవల్లి, వడ్డేశ్వరం పంచాయతీలను విలీనం చేశారు. అలాగే అమరావతి క్యాపిటల్‌లో అబ్బరాజుపాలెం, అనంతవరం, బోరుపా లెం, దొండపాడు, హరిచంద్రాపురం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, మందడం, నెక్కళ్లు, నేలపాడు, పెదపరిమి, రాయపూడి, శాఖమూరు పంచాయతీలను విలీనం చేశారు. విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వచ్చినా లక్ష్య పెట్టలేదు. ఫలితంగా పంచాయతీలకు సంబంధించి అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అక్కడ ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ కారణంగా 69 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయినట్టు అధికారులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని రంగాలకు ఊరట: ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీ భారాన్ని తగ్గించడంతో అన్ని రంగాల ప్రజలకు ఊరట దక్కిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంస్కరణలతో భారతదేశం వికసిత భారత్ దిశగా పయనిస్తోందని ఆయన కొనియాడారు. ప్రభుత్వం వివిధ వర్గాలలోని అనేక వస్తువులపై జీఎస్టీని తగ్గించినందుకు ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. మధ్యతరగతి వస్తువులపై, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి సామాన్య ప్రజలకు, వ్యవసాయ రంగానికి చేయూతనందించడం శుభపరిణామమని నరేంద్ర అన్నారు. ప్రాణాలను రక్షించే మందులపై జీఎస్టీని 12 శాతం నుంచి పూర్తిగా తగ్గించడమే కాకుండా క్యాన్సర్, అరుదైన వ్యాధులు, ఇతర తీవ్రమైన దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలకు ఉపయోగించే ఔషధాలపై జీఎస్టీని మాఫీ చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఆటోమోటివ్ రంగానికి కూడా చేయూతనిచ్చేలా, సామాన్యులకు బీమాను అందుబాటులోకి తీసుకురావడానికి జీఎస్టీని మినహాయించడం ప్రజలకు వరమని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్ను సంస్కరణలకు నాంది పలికి దేశాన్ని వికసిత భారత్ వైపు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ కొనియాడారు.

విద్యుత్ శాఖలో... జూనియర్ ఇంజనీర్లకు ఏఈలుగా పదోన్నతి

● దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్ క్లియర్

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్) సంస్థలో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్లను ఏఈలుగా పదోన్నతి కల్పిస్తూ సీఎండీ పుల్లారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న వారి సమస్య తీరినట్లయింది. సీపీడీసీఎల్ పరిధిలోని 53 మంది జూనియర్ ఇంజనీర్లకు సెక్షన్ ఆపరేషన్ ఏఈలుగా పదోన్నతి కల్పించి వారికి కొత్తగా పోస్టింగ్‌లు కూడా కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కొత్తగా సర్కిల్స్ పునర్విభజన చేసిన నేపథ్యంలో ఆయా సర్కిల్స్ పరిధిలోని సెక్షన్‌లకు ఏఈలను నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఏపీ సీపీడీసీఎల్‌లో సెక్షన్ స్థాయిలో అనేక మంది జూనియర్ ఇంజనీర్లుగా పనిచేస్తోన్న వారు దశాబ్దకాలంపైగానే పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. పదోన్నతులు లేక అనేక సెక్షన్ కార్యాలయాల్లో జూనియర్ ఇంజనీర్లనే ఇన్‌చార్జ్‌లుగా నియమించి కాలం గడుపుతున్నారు. అత్యధికంగా ప్రకాశం, పల్నాడు సర్కిల్స్ పరిధిలోని సెక్షన్ కార్యాలయాల్లో జూనియర్ ఇంజనీర్లే ఇన్‌చార్జ్ ఏఈలుగా కొనసాగుతున్నారు. సీపీడీసీఎల్ పరిధిలో మొత్తం 53 మందికి పదోన్నతులు కల్పించిన సీఎండీ అదే సమయంలో వారికి పోస్టింగులు ఇచ్చారు. సీఎండీ నిర్ణయం పట్ల ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

ఆరుగురు ఏఓలకు ఎంపీడీఓలుగా ప్రమోషన్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఆరుగురు ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లాలలోని చేబ్రోలు, నాదెండ్ల, రొంపిచర్ల ఏఓలుగా పనిచేస్తున్న ఏ ఉమాదేవి, ఎస్ స్వరూప రాణి, ఏఓ వి శ్రీనివాసరావు, వి వెంకటేశ్వరరావు, ప్రకాశం జిల్లా కొల్లిపర ఏఓ వి ప్రతాపరెడి, పెదకాకాని ఏఓ సీహెచ్ శ్రీనివాసరావు (కమిషనర్ కార్యాలయం) లకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ నుంచి ఎంపీడీఓలుగా ప్రమోషన్ పొందిన మరో నలుగురిని ఉమ్మడి జిల్లాకు కేటాయించారు.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మండల పరిధిలోని పెదపులివర్రు గ్రామానికి చెందిన వాకా శరత్ (25) అనే కౌలు రైతు గురువారం మృతి చెందాడు. శరత్ ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పొలానికి నీటిని పెట్టిన అనంతరం మోటార్ స్విచ్ ఆఫ్ చేస్తుండగా కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శరత్ భార్య కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని ఈ సందర్భంగా ఎస్‌ఐ చెప్పారు.

సర్దుబాటు చేయరూ..?

(3వ పేజీ తరువాయి)

ద్వితీయ శ్రేణి పౌరుల మాదిరిగా చిన్న చూపుతో వివక్షకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కారణంగా గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఎక్కడ ఏ పనికి అవసరం అయితే అక్కడ తమను వాడుకుంటున్నారు తప్ప ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చడం లేదని ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయి అధికారులు కనీసం పండుగలు, సెలవులు, ఆదివారాలలో సైతం పని ఒత్తిడితో ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. తాజాగా తల్లికి వందనం, రేషన్ కార్డుల జారీ వంటి పలు సంక్షేమ పథకాల సమయంలో రాత్రింబవళ్లు పనిచేయాల్సిన పరిస్థితి. ప్రతి శాఖ పనికి ఒక ఉద్యోగిపై అనేక శాఖల అధికారుల అజమాయిషీ వలన ఉద్యోగులు మానసిక వత్తిడికి గురై సరికొత్త ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

జాబ్ చార్టులో నిర్దిష్టత ఏది?

సచివాలయ వ్యవస్థ రూపకల్పన జరిగి ఇప్పటికి ఆరేళ్లవుతోంది. కానీ ఈరోజు వరకూ ఉద్యోగుల విధులకు సంబంధించి స్పష్టమైన జాబ్‌చార్టును విడుదల చేయలేదు. పంచాయతీ కార్యదర్శికి కార్యదర్శివిధులతోపాటు, సంక్షేమ పథకాల అమలు బాధ్యత అప్పగించారు. వాటితోపాటు ఇతర అనుబంధ ఉద్యోగులైన వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్‌వో, మహిళా పోలీస్ సహా పలువురు ఉద్యోగులకు వారి శాఖాపరమైన విధులతోపాటు, సంక్షేమ కార్యక్రమాల అమలు, సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాల పనులను కూడా అప్పగిస్తున్నారు. ఇలా నిర్దిష్టమైన జాబ్‌చార్టు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర గందరగోళం, ఒత్తిడికి గురవుతున్నారు.

7న పెదకాకాని శివాలయంలో దర్శనాల నిలిపివేత

పెదకాకాని, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా దర్శనాలను నిలిపివేస్తున్నట్లు దేవస్థానం ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్వామి వారి మహా నివేదన అనంతరం ఆలయ తలుపులు మూసి వేస్తామని, ఆ రోజు నిర్వహించే రాహుకేతు పూజలు కూడా నిలిపేస్తామన్నారు. 8వ తేదీ ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు, అభిషేకాలు, ఇతర అన్ని సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

యాత్రికుడికి గుండెపోటు

● వెంటనే ఇంజక్షన్ ఇవ్వడంతో దక్కిన ప్రాణాలు

వినుకొండటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ నుంచి విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్తున్న యాత్రికుల బస్సులో ఓ వృద్ధుడికి గుండెపోటు రావడంతో తోటివారు ఆయన్ను హుటాహుటిన వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ఇంజక్షన్ చేయించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన గురువారం జరిగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన యాత్రికుల బస్సు వినుకొండ వైపు నుంచి విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్తుండగా బస్సులో ప్రయాణిస్తున్న అశోక్‌సేన్ అనే వృద్ధుడికి గుండెపోటు వచ్చింది. బస్సును నరసరావుపేట రూట్‌లో ఆపి ఓ ఆటో డ్రైవర్ సాయంతో హుటాహుటిన ఆయన్ను విను కొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి గుండెపోటు ఇంజక్షన్ చేయించారు. దాంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రొంపిచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల నుంచి సంతగుడిపాడు వెళ్లే దారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు మరణించి ఉంటాడని రొంపిచర్ల పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని వివరాలు తెలియరాలేదని ఎస్సై మణికృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

70,144 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 75,968 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,144 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,795 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14300
నెంబరు. 5	10000	13400
273	----	----
341	10000	15300
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15400
షార్క్-1	----	----
బ్యాడిగి 355	10000	15000
దేవనూరు డీలక్స్	10000	13600
ఆర్మూరు	9800	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14500
నెంబరు. 5	10000	13500
273	10500	13800
341	11000	15500
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300
బ్యాడిగి 355	10000	14800
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	----	----
తాలుకాయలు	5000	7800

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాచేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో చేపట్టిన విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని దాచేపల్లి పట్టణ ఏఈ భగవాన్ నాయక్ తెలిపారు.

● బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయని, ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మండల విద్యుత్ ఏఈ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

● మాచర్ల పట్టణంలోని 11కేవీ సుద్ధగుంతల ఫీడర్‌లో రెక్టిఫికేషన్ పనులు నిమిత్తం శుక్రవారం సుద్ధగుంతల, పీడబ్ల్యూడీ కాలనీలలో ఉదయం 9 మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.

పెదకూరపాడు మండలంలోని లగడపాడు, కస్నెగండ్ల, గారపాడు, హుస్సేన్‌నగరం, బుచ్చయ్యపాలెం, రామాపురం గ్రామాల్లో విద్యుత్ కోత విధిస్తున్నట్టు ఆ శాఖ ఏఈ దాసరి రామకృష్ణ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా యామని


యామని రామారావు

మాచవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొత్తపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు యామని రామారావును నియమించారు. ఈ మేరకు అగ్రికల్చర్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల నాయకులు రామారావుకు అభినందనలు తెలిపారు. రామారావు కొత్తపాలెం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా కూడా పని చేస్తున్నారు.

భక్తులకు అన్నదానం

మాచర్లటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డులో బురుజు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద గురువారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేల్పుల అశోక్, ఆకుల శ్రీశైలం, గాజుల చిన వీరాంజనేయులు, ముదిశెట్టి శ్రీనివాసరావు, కంభంపాటి చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల శాంపిల్స్ సేకరణ

నకరికల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులోని ఎరువుల దుకాణాలకు సంబంధించి గోడౌన్‌లలో నిల్వ ఉన్న ఎరువులకు సంబంధించి శాంపిల్స్‌ను సేకరించి ఏవో దేవదాసు నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. శ్యాంపిల్స్ సేకరణలో ఏఏ ప్రభాకర్ పాల్గొన్నారు.

బడిలో చేరిన బాల కార్మికులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళిపాళ్ళ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న బాలకార్మికులను ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరరావులు గురువారం గుర్తించారు. బడి బయట ఉన్న పిల్లలకు పాఠశాలల్లో చేర్పించాలని, చదువు వల్ల కలిగే ఉపయోగాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న నలుగురు బాలురను వెన్నాదేవి జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు.

అరుణాచలంకు బస్సు సర్వీసు

సత్తెనపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసును ఈనెల 5వ తేదీ రాత్రి 9 గంటలకు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ గురువారం తెలిపారు. 6వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదే రోజు రాత్రి అరుణాచలం చేరి దర్శనం అనంతరం 7వ తేదీ కంచికి చేరుకుంటుందన్నారు. 7వ తేదీ రాత్రి కంచి నుంచి బస్సు బయలు దేరి 8వ తేదీ ఉదయం సత్తెనపల్లి చేరుకుంటుందన్నారు. రానుపోను టిక్కెట్ ధర రూ.2500 ఉంటుందని తెలిపారు. వివరాలకు 9959225429 నెంబరులో సంప్రదించాలన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నకరికల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి నకరికల్లు ఎంపీడీవో కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ఈ రక్తదాన విబిరంలో పాల్గొనాలని కోరారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటనన మండలంలోని అబ్బూరులో గురువారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన రాచమంటి సామ్రాజ్యం(54)కు మతిస్థిమితం లేదు. నాలుగు రోజులు క్రితం ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఉదయాన్నే చెరువులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారాన్ని రూరల్ పోలీసులకు చేరవేశారు. వారు చెరువు వద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించగా మృతురాలు సామ్రాజ్యంగా గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

రూ.110 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
● ఒక ఏడాదిలో రాష్ట్ర చరిత్ర మారుతుంది
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.110 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం చెరుకుంపాలెంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి పనులు ప్రారంభించామని తెలిపారు. నియోజకవర్గంలోని మరో 12 గ్రామాలు రాజధానిలో భాగం కాబోతున్నాయని, మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ముందుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ టీడీపీ అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీకి రాని వారు ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని, పాలిటిక్స్ ప్లే చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముందుగా రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మురుగు కాలువలకు శంకుస్థాపన చేసిన


డ్రెయిన్స్‌కు శంకుస్థాపన చేస్తున్న భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్

అనంతరం రూ.9 లక్షల నిధులతో బీసీ కాలనీలోని అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఎన్ఆర్ఈజీఎస్ పీడీ సిద్ధ లింగమూర్తి, సీడీపీవో ఎస్ వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, ఎంపీపీ భూక్య స్వర్ణమ్మ రమేష్, నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తహసీల్దార్, ఎంపీడీవో, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామానికి తాగునీరు, సైడ్ డ్రెయిన్స్ కావాలి

చెరుకుంపాలెం గ్రామానికి తాగునీరు, సైడు డ్రెయిన్‌లు కావాలని ఎమ్మెల్యేను కోరారు. ఎత్తిపోతల పథకానికి నిధులు అందజేయాలని అన్నారు.

స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో

చెరుకుంపాలెంలో స్నేహహస్తాల ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రవీణ్‌తో పాటు కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. మాదిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజన షెడ్డును నిర్మించేందుకు రూ.3 లక్షలు, మాదిపాడు హైస్కూల్ విద్యార్థులకు ఆరు సైకిళ్లతో పాటు తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురికి, అచ్చంపేట జడ్పీ విద్యార్థులు ముగ్గురికి, మొత్తం 15 మంది విద్యార్థులకు సైకిళ్లు అందించారు. డిగ్రీ విద్యార్థి ఆర్ తిరుపతమ్మకు రూ.15వేలు చెక్కును, బీటెక్ విద్యార్థి నిహారికకు రూ.20వేలు చెక్కును, రెసిడెన్షియల్ పాఠశాలకు రూ.30వేలు ఆట వస్తువులను వీరి ద్వారా అందజేశారు. స్నేహ హస్తాల ఫౌండర్ ఎన్ఆర్ఐ కూరపాటి శివరామ్ (లండన్) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు తుమ్మా శౌరిరెడ్డి, స్నేహ హస్తాల ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ కరీముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దళిత బాధితులకు సంక్షేమ పథకాలు

● డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి


సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

దుర్గి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దళిత బాధితులకు సంక్షేమ పథకాలు, భూములు, నివేశిత స్థలాలు, జీవనోపాధికి రుణాలు, గేదెలు, ఉద్యోగాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి అన్నారు. గురువారం మండలంలోని ఆత్మకూరు చర్చి ఆవరణలో దళితులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఆత్మకూరు గ్రామ దళితులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సారథ్యంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ మేరకు గ్రామానికి విచ్చేసిన పీడీ ఝాన్సీరాణి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చేదుకు ప్రభుత్వం యంత్రాంగాన్ని గ్రామానికి పంపారన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయగనోర్ ఆదేశాల మేరకు సర్వే జరుగుతుందన్నారు. 127 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. 67 పాత ఇంటి స్థలాలను మరమ్మతులు చేయాలని, 20 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలని, అర్హులైన వారికి పెన్షన్లు, జీవనోపాధికి రుణాలు, డప్పు, చర్మకారులకు మంజూరు చేయాలని దళిత నేతలు మాచర్ల మదార్, పేరువాల ఏసోబు ఆమె దృష్టికి తెచ్చారు. వీటిపై ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. స్పెషలాఫీసర్‌గా ఆర్డీవో మురళీకృష్ణ నియమితులయ్యారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఏపీవో మల్లికార్జునరావు, ఏపీఎం వెంకటరంగారెడ్డి, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మాచర్లరూరల్, సెప్టెంబరు 4: ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే వారికి ఆదాయం వచ్చే కార్యక్రమాలను ఎంచుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎం డేవిడ్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

అనధికార లే అవుట్‌లకు అనుమతులు తీసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

దాచేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ జీ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దాచేపల్లి నగర పంచాయతీలో 15 అనధికార లేఅవుట్‌లు ఉన్నాయని, 65 ఎకరాల్లో లేఅవుట్‌లను వేశారని తెలిపారు. కొంత మంది వ్యాపారులు అనాలోచితంగా చేసిన చర్యలతో వెంచర్లలో ప్లాట్లు కొన్న వారు నష్టపోతారని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు రావటం, ప్రభుత్వం ద్వారా వచ్చే రహదారులు, విద్యుత్ దీపాలు, తాగునీటి పైపులైన్లు, డ్రెయినేజ్ నిర్మాణం వంటి అవకాశాలు ఉండవనని, అనధికార లేఅవుట్‌లలో కొను గోలు చేసిన వారిని గుర్తిం చాలని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు రావాలన్నా, స్థలాలను క్రయ విక్రయాలు చేసుకోవాలన్నా ప్రభుత్వపరంగా ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను జూలై 26 నుంచి అక్టోబరు 24వ తేదీ లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని కోరారు. అక్టోబరు 24 తరువాత అనధిక లే అవుట్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన నేషనల్ బిల్డర్ అవార్డులు ప్రదానోత్సవం

మాచర్లటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యాన గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు, సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులు వీర్నాల కొండలు, షేక్ అలీంబి, ముళ్లపూడి వెంకటసుబ్బారావు, అందుగుల రాజీవ్ రత్నకుమారిలకు నేషనల్ బిల్డర్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మలప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి యనమదల వెంకట్రామయ్య, క్లబ్ సభ్యులు డాక్టర్ రామకోటయ్య, నాగూర్‌వలి, సిద్ధం రాజు, రామ్మూర్తి, శంకర్, సత్యనారాయణ, ఎస్ నరసింహారావు, చెరుకూరి నరసింహారావు, పంతంగి రామారావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

● మిట్ట సెంటర్ స్వామి పూజల్లో భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్


మిట్ట సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


కొమ్మాలపాటి శ్రీధర్‌కు వినాయకుడి చిత్రపటాన్ని బహూకరిస్తున్న మిట్ట గణేష్ ఫ్రెండ్ సర్కిల్

పెదకూరపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెదకూరపాడు మిట్టసెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ కూడా మిట్ట గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, పరస తాళ్ళూరు వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, మిట్ట గణేష్ ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులైన భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్‌లకు వినాయకుడి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, పమిడాల వెంకటరావు, అడ్డ ప్రసాదు, ఏటుకూరి గంగాధర్, దర్శి రాజారావు, ఏపూరి నాగేశ్వరరావు, కృష్ణమనేని లలిత బాబు, వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు మిట్ట గణేష్ కమిటీ ఆధ్వర్యంలో భోజనాలను ఏర్పాటు చేశారు.

● అమరావతి మండలంలోని ధరణికోటలో సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో వినాయక చవితి పురస్కరించుకుని జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం రాత్రి స్వామి కల్యాణం జరిగింది. గురువారం సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

● కారంపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లిలో టీడీపీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడి విగ్రహాన్ని కరెన్సీ నోట్లతో అలంకరించారు. మహిళా మండలి సభ్యులు లలితా, విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు.

● దుర్గిలోని ముటుకూరులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. స్వామి వారికి నివేదించిన లడ్డు ప్రసాదాన్ని రూ. 52 వేలకు గోళ్ల ఆంజనేయులు దక్కించుకున్నారు.

మత్స్యకారులందరు ఒక లైసెన్సుకే పరిమితం కావాలి

● డీఎఫ్ఓ డీడీ సంజీవరావు

రెంటచింతల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టే మత్స్యకారులందరూ ఒక లైసెన్సుకే పరిమితం కావాలని రెండు రాష్ట్రాల్లో లైసెన్స్‌లు పొందే అధికారం లేదని అలా అయితే వాటిని రద్దు చేస్తామని జిల్లా మత్స్యశాఖాధికారి డీడీ సంజీవరావు స్పష్టతనిచ్చారు. ఆంధ్రజ్యోతిలో ఆంధ్రామత్స్యకారులపై తెలంగాణ మత్స్యకారులు దాడి అనే వార్త గురువారం ప్రచురితం కావడంతో వివిధ శాఖల అధికారులు తక్షణమే స్పందించి సత్రశాలలోని ఓ సత్రంలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో డీడీ మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడికి ఏడాదిపాటు అంటే జూన్ 30 వరకు లైసెన్స్ ఇస్తామని జూలై ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధమని పేర్కొంటూ ఏ ప్రాంతానికైతే లైసెన్సు పొందుతారో అక్కడే చేపల వేట చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాచర్ల మండల మత్స్యశాఖాధికారి టీవీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ మేరీ కనకం, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, మత్స్యకార సంఘానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయం

● సంగం డెయిరీ మేనేజర్ శివరామకృష్ణ


బోనస్ పంపిణీ చేస్తున్నమేనేజర్ శివరామకృష్ణ

రెంటచింతల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ ధ్యేయమని వారంతా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చేయూతనందిస్తున్నామని గురజాల సంగం డెయిరీ మేనేజర్ శివరామకృష్ణ అన్నారు. గురువారం రెంటచింతలలో రూ.2,27,680ల బోనస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ శివ, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

వీఆర్‌వోలపై ఆర్డీవోకు ఫిర్యాదు


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

దాచేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెవెన్యూ కార్యదర్శుల పని తీరు సక్రమంగా లేదని గురజాల ఆర్డీవో మురళీకృష్ణకు కే ఫ్యూజన్ ఫిర్యాదు చేశారు. మండలంలోని వీఆర్వోలు అర్జీదారుల సమస్యలపై స్పందించకుండా నెలల తరబడి తిప్పుతున్నారని, ఇదేమని? అడిగితే నిర్లక్ష్యంగా బదులు ఇస్తున్నారని ఆర్డీవోకు వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీఆర్‌వోలపై చర్యలు తీసుకోవాలని, సామాన్య ప్రజలకు భరోసాను కల్పించాలని కోరారు.

ఆర్యవైశ్యులతో కలిసి శ్రీవారి దర్శనం


తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పట్టణ ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సాధారణ ఎన్నికలకు ముందు పిడుగురాళ్ల పట్టణంలో ఇంటింటి ప్రచారానికి వెళ్లినపుడు పలువురు ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు, నేతలు పెద్దఎత్తున సంఘీభావాన్ని తెలిపారు. స్వామివారి దర్శనం మీతో కలిసి వెళ్లే అవకాశాన్ని కల్పించాలని కొందరు నేతలు ప్రత్యేకించి మహిళలు తమ మనసులోని మాటను యరపతినేని ఎదుట వ్యక్తపరిచారు. తప్పకుండా తనతో పాటు వేంకటేశ్వరస్వామి దర్శనానికి తీసుకెళ్తానని ఇచ్చిన మాట మేరకు గురువారం కొందరిని స్వామి దర్శనానికి ఎమ్మెల్యే యరపతినేని దంపతులు తీసుకెళ్లారు.

ఆర్థిక సహకారం అందజేత

సత్తెనపల్లిరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దీపాలదిన్నెపాలెం ఎస్సీ కాలనీకి చెందిన చిలకా దానమ్మ మృతి చెందింది. సమాచారం అందుకున్న మార్కెట్‌యార్డు డైరెక్టర్ పాటిబండ్ల పూర్ణచంద్రరావు, కిలారి కృష్ణగిరి సుమన్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు దానమ్మ మృత దేహాన్ని గురువారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. రూ.10వేలు నగదును కుటుంబసభ్యులకు పాటిబండ్ల పూర్ణచంద్రరావు అందజే శారు.

● మాచర్లటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త గోపి అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందాడు. ఆర్యవైశ్య నేత కట్టమూరి సతీష్‌బాబు, జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావులు గురువారం గోపి భౌతికకాయానికి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు కుటుంబసభ్యులకు అందజేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.20 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,510 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది.

యూరియా కొరత లేదు

● రైతులు ఆందోళన చెందవద్దు
● యార్డు చైర్మన్ మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్


యూరియా నిల్వలను పరిశీలించిన మల్లీశ్వరి మధుసూదన్‌యాదవ్, యాగంటి

మాచర్లటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డు గోడౌన్‌లో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్‌యాదవ్ తెలిపారు. గురువారం మార్కెట్‌యార్డులోని గోడౌన్లలో యూరియా నిల్వలను గురువారం టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది 40 శాతం అదనంగా రాష్టానికి యూరియా నిల్వలు వచ్చాయన్నారు. ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని వైసీపీ నేతలు కుట్రలు పనుతున్నారన్నారు. యాగంటి మాట్లాడుతూ ప్రతి పక్ష నేతలు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను తప్పుదారి పట్టించాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులకు యూరియా కట్టలకు గాని, డీఏపీ కట్టలకు గాని ఎలాంటి ఇబ్బంది లేదని, సరైన సమయంలో అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.5.35 లక్షల ఎరువుల అమ్మకాలు నిలిపివేత


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రవిబాబు, ఏవో సుబ్బారెడ్డి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో సత్తెనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు బీ రవిబాబు, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డిలు ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల్లోని ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఫారం-ఓ పత్రాలు లేని రూ.5,35,050 విలువ 18.35 మెట్రిక్ టన్నుల పరిమాణం గల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్టు ఏడీఏ రవిబాబు తెలిపారు. రైతు సేవాకేంద్రాలు, సహకార సంఘాల్లో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్టు ఆయన తెలిపారు. అధిక ధరలకు ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమంగా ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ

దాచేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా యూరియాను తరలించినా.. విక్రయంచినా కఠిన చర్యలు తీసుకుంటామని దాచేపల్లి సీఐ భాస్కరరావు హెచ్చరించారు. ఇటీవల కొంతమంది యూరియాను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, వారిని పట్టుకున్నామని తెలిపారు. 14 యూరియా కట్టలను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపెట్టినట్టు తెలిపారు.

అవసరమైన మేర అందుబాటులో యూరియా : తహసీల్దార్

నకరికల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు సరిపడిన యూరియా అందుబాటులో ఉందని తహసీల్దార్ కే పుల్లారావు అన్నారు. గురువారం నకరికల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులకు యూరియా పంపిణీని ప్రారంభించారు. అవసరమైన మేరకే రైతులు కొనుగోలు చేయాలని ఏవో దేవదాసు సూచించారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి వెంకటరావు, రామదాసు, సీఈవో కోళ్ళపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్న రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్టు ఏవో దేవదాసు గురువారం తెలిపారు. మండలంలో 88 మంది రైతులు గ్రీవెన్స్‌లో అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారందరి ఖాతాల్లో గురువారం నగదు జమయినట్టు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఏవో తనిఖీ

మాచర్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎరువుల దుకాణాలను గురువారం ఏవో పాపకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 152 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు సరిపడా అందుబాటులో ఉందన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలి

● ఎరువుల దుకాణాల అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం

దాచేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని దాచేపల్లి మండల ఎరువుల దుకాణాల అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గురువారం దాచేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యాపారులంతా రైతుల పరిస్థితులను అర్థం చేసుకొని వారికి అండగా నిలబడాలని కోరారు. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వం అందజేస్తున్న ఎరువులను ఆంధ్రా రైతులకే అందేవిధంగా చూడాలని నిర్ణయించారు. సమావేశంలో అక్కిన బాలయ్య, ఆతుకూరి సైదేశ్వరరావు, రాచమడుగు ప్రసాదు, మనిగళ్ళ రామకృష్ణ, నాగమణి గురువులు, మాశెట్టి శ్రీనివాసరావు, పొనాది వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా ఏపూరి


ఏపూరి నాగేశ్వరరావు

క్రోసూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన ఏపూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ గ్రంథాలయ పరిషత్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగేశ్వరరావు నియోజకవర్గంలో సీనియర్ టీడీపీ నాయకుడిగా.. 2015 నుంచి 2017 వరకు క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా పని చేశారు. 2023 నుంచి ఇప్పటి వరకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

లింగ సమానత్వంపై అవగాహన

గురజాలటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని అర్బన్ పీహెచ్‌సీలో గురువారం లింగసమానత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్‌శక్తిలో భాగంగా లింగ సమానత్వంపై వైద్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బందికి వైద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అవగాహన కల్పించారు.

ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్లులోపు వినియోగించుకోవాలి

గురజాలటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్ల లోపు మాత్రమే విద్యుత్ వినియోగించుకోవాలని ఏఈ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 200 యూనిట్లు దాటితే బిల్లు మొత్తం కట్టాల్సి ఉంటుందన్నారు. బిల్లు కట్టకుంటే సర్వీసును తొలగిస్తామన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు

కారంపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఎంఈవోలు అనిల్‌కుమార్, రవికుమార్‌లు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని ఇవ్వాలని సూచించారు.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.


ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు




కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్జియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్జియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

గురువుకు పట్టం



రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురి ఎంపిక

- ప్రొఫెసర్ల విభాగంలోనూ ముగ్గురికి చోటు
- జిల్లాస్థాయిలో 33 మంది టీచర్లకు దక్కనున్న సత్కారం
- నేడు టీచర్స్ డే సందర్భంగా అవార్డుల అందజేత

ఓ విద్యార్థి పరిపూర్ణమైన వ్యక్తిగా మారడానికీ గురువు పాత్రే అత్యంత కీలకం. సమాజం సరైన రీతిలో నడక సాగించాలన్నా, పురోగమించాలన్నా గురువుల ప్రోత్సాహం ఎంతో అవసరం. ఇంతటి సమున్నత వ్యక్తిత్వం కలిగిన ఉపాధ్యాయులను భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజైన సెప్టెంబరు 5న గౌరవించుకోవడం అనాదిగా వస్తోంది. శుక్రవారం టీచర్స్ డేను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు సన్మానం జరగనుంది. రాష్ట్రస్థాయిలో ముగ్గురు ఉపాధ్యాయులకు, జిల్లాలో 33 మంది టీచర్లకు సన్మానం జరగనుంది. కళాశాల స్థాయిలో కూడా జిల్లా నుంచి ముగ్గురు ప్రొఫెసర్లను ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కించుకోవడంపై గురువులు ఆనందం వ్యక్తం చేశారు.

-(బాపట్ల/ పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆంధ్రజ్యోతి)

సర్వీస్‌కు గుర్తింపు దక్కింది

30 సంవత్సరాల సర్వీస్‌కు ఈ అవార్డు ద్వారా గుర్తింపు దక్కినట్లయింది. రాష్ట్రస్థాయిలో ఫార్మసీ విభాగంలో ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉంది. ఫార్మసీ కళాశాలలో 10 ప్రయోగాలకు పేటెంట్స్ వచ్చాయి. పరిశోధనా విభాగంలో ఎన్నో మైలురాళ్లను మా కళాశాల చేరుకుంది. 105 మాస్టర్ ప్రాజెక్టులను సూపర్‌వైజ్ చేశాం. 25 మంది పీహెచ్‌డీ స్కాలర్స్‌ను గైడ్ చేయడం మరింత ఆనందాన్నిచ్చింది. రీసెర్చ్ పేపర్ల ప్రచురణ, సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లు కండక్ట్ చేయడం ఇలా ప్రతి దశలోనూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నాం. భవిష్యత్తులో మరెన్నో నూతన ఆవిష్కరణలకు ఈ అవార్డు కచ్చితంగా ప్రేరణనిస్తుంది



--గోపాల కృష్ణమూర్తి, బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ప్రిన్సిపాల్

మరింత ఉత్సాహంగా



అగ్రికల్చర్ విభాగంలో ప్రభుత్వం ఉత్తమ ప్రొఫెసర్ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. నేను చదువుకుంది బాపట్ల ఏజీ కళాశాలలోనే. ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేయడం అరుదైన గౌరవం కాగా ఈ అవార్డు అందుకోవడం దానిని రెట్టింపు చేసింది. ఇలాంటి గుర్తింపు మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది.

--కే జయలలిత, ప్రొఫెసర్ ఆఫ్ క్రాప్ సైకాలజీ, ఏజీ కళాశాల బాపట్ల

ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నన్ను ఎంపిక చేయటం నాపై మరింత బాధ్యతను పెంచింది. నేను ఉపాధ్యాయురాలిగా పనిచేయడమే కాకుండా కవయిత్రిగా పరిశోధకురాలిగా రాణిస్తున్నాను. రాష్ట్రంలో 18 లక్షల మంది విద్యార్థులు నేను రూపొందించిన 1, 2, 9 తరగతుల తెలుగు పాఠ్యపుస్తకాలనే అభ్యసిస్తున్నారు.

--భద్రావతి, చేబ్రోలు చీలిపాలెం మండల పరిషత్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు

చాలా సంతోషంగా ఉంది



నేను తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ప్రస్తుత పరిస్థితుల్లో మాతృభాషను పది కాలాల పాటు వర్ధిల్లేలా చేయడమే పెద్ద సవాలు. ఈ దిశగా నేను చేస్తున్న కృషికి తగిన గుర్తింపు దక్కింది. పిల్లల కోసం తెలుగు పలుకు అనే పుస్తకం రాశాను. తెలుగుకు సంబంధించి నెలనెలా క్విజ్ పెట్టి ప్రోత్సాహం కోసం పిల్లలకు బహుమతులు ఇస్తున్నాను. పిల్లలకు కథల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాను. తెలుగుకు సంబంధించి భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేయడానికి నేను ఈ రోజు అందుకోబోయే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరింత ప్రేరణగా ఉండనుంది.

--జే ప్రతాప్, తెలుగు ఉపాధ్యాయుడు, తిమ్మాపురం జడ్పీ హైస్కూల్

ఇక్కడే చదువుకుని.. ప్రొఫెసర్‌గా

బాపట్ల ఏజీ కళాశాలలోనే నేను చదువుకున్నాను. 15 ఏళ్లుగా ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. నలుగురు పీహెచ్‌డీ స్టూడెంట్స్, 20 ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ విద్యార్థులకు గైడ్ చేశాను. జన్యుశాస్త్ర పరిశోధనలకు సంబంధించి విదేశాలలో ప్రజంటేషన్ ఇచ్చాం. అమెరికాలో మూడు నెలల ట్రైనింగ్ ప్రోగ్రాంకు హాజరయ్యాను. వందకు పైగా పరిశోధనా పత్రాలను దేశ విదేశీ జర్నల్స్‌లో ప్రచురించే అవకాశం నాకు దక్కింది. 2016లో అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా యూనివర్సిటీ ఉత్తమ ప్రొఫెసర్‌గా అవార్డు అందుకున్నాను. ఇప్పుడు మళ్లీ ఆయన చేతుల మీదుగానే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రొఫెసర్‌గా సత్కారం అందుకోవడం ఆనందంగా ఉంది



--లాల్ అహ్మద్ మహమ్మద్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్రొఫెసర్ ఏజీ కళాశాల, బాపట్ల

ప్రయోగాల ద్వారా బోధన

బయాలజికల్ సైన్స్‌ను బోధిస్తున్న నాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు దక్కడం ఆనందంగా ఉంది. సైన్స్ అంటేనే ప్రయోగం. ప్రతి విషయాన్ని పిల్లలకు ఆ విధంగానే బోధించడం నాకు ఇష్టం. ఇక్కడ చదువుకునే పిల్లలను చాలా చోట్ల సైన్స్ సెమినార్‌లకు హాజరయ్యే విధంగా చేశాను. అంతే కాకుండా జాతీయ స్థాయి వేదికలపై కూడా ఇక్కడి విద్యార్థులు చేసిన ప్రయోగాలకు చోటు దక్కింది. పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించే దిశగా మరింత వినూత్నంగా అడుగులేయడానికి ఈ అవార్డు ఓ ప్రేరణగా నిలవనుంది. ఇంతటి గౌరవం ఇచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు



--కె. మోహనాంజలి, బయాలజీ టీచర్, మక్కెనవారిపాలెం జడ్పీ హైస్కూల్

మహిళా కమిషన్ శిక్షణకు అధికారులను పంపండి..!

● సీఎస్ విజయానంద్‌ను కోరిన చైర్‌పర్సన్ రాయపాటి శైలజ


సీఎస్ విజయానంద్‌కు మొక్కను అందజేస్తున్న రాయపాటి శైలజ

గుంటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి రాష్ట్రం తరఫున అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సీఎస్ విజయానంద్‌ను కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం ఆమె సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల రక్షణ, చట్టాలు, భద్రతపై అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. జాతీయ మహిళా కమిషన్, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రం నుంచి అధికారులతో పాటు పోలీసు అధికారులను నామినేట్ చేయాలని ఆమె కోరారు. సెప్టెంబరు 12 నుంచి 14 వరకు డామన్ డయ్యూలో జరుగుతున్న జాయింట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి అధికారులు హాజరయ్యేలా జాతీయ మహిళా కమిషన్ చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ శిక్షణలో పౌర, పోలీసు అధికారుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, మహిళా సంక్షేమ పథకాలు, చట్టాల అమలులో మెరుగుదల, అలాగే బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ వంటి కొత్త చట్టాలపై ఉన్నతాధికారులకు అవగాహన కల్పిస్తారని రాయపాటి శైలజ సీఎస్‌కు వివరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి సూచించారు. గురువారం గుంటూరులోని కృషిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో ప్రతి రోజూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మార్కెటింగ్ సీనియర్ థిమాటిక్ లీడ్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతులు సాగుచేస్తున్న అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలకు నాణ్యమైన ధరలకు మార్కెటింగ్ సదుపాయం కలగనుందని అన్నారు. రబీలో రూపొందించాల్సిన ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. డీఆర్‌డీఏ పీడీ తలారి వెంకట విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో మునగ పంట పీకేఎం రకం సాగు చేసే రైతులకు మహిళా సంఘాల గ్రూప్ ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యాంకర్ గోపి, మార్కెటింగ్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ లోకేష్, జిల్లా అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రాజెక్టు జిల్లా మేనేజర్ రాజకుమారి, చిత్రంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తదితరులు

నేడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక ప్రకాష్ నగర్‌లోని భువన చంద్ర టౌన్‌హాల్‌లో జిల్లాస్థాయి గురు పూజోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ యేడాది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఈ సందర్భంగా సన్మానించనున్నారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన మంత్రులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొననున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు చీఫ్ విప్ జీవీ ప్రజాదర్బార్

వినుకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. జీవీ ఆంజనేయులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు.

ఆయిల్ మిల్లుపై జీఎస్టీ అధికారుల దాడి

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని విజయలక్ష్మి ట్రేడర్స్ ఆయిల్ మిల్‌పై గురువారం గుంటూరుకు చెందిన జీఎస్టీ అధికారులు దాడిచేశారు. ఈ సందర్భంగా మిల్లులోని అకౌంట్ పుస్తకాలను, అన్ని పత్రాలను స్వాధీనం చేసుకుని తీసుకు వెళ్లినట్లు సమాచారం.

క్లుప్తంగా...

● నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నేత్రదానంపై అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ పాల్గొని నేత్రదాన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏడుకొండలు ,రామకృష్ణ, లక్ష్మీ కుమారి, మహేష్ ,సులేమాన్, నర్సింగ్ అధికారి కరుణ, ఎం ఏ ఎం కళాశాల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కోసూరు నాగేశ్వరరావు రూ.12వేలు విలువ చేసే గడ్డి కోసే మిషన్‌ను గురువారం బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● ఈపూరు: మండలంలోని ఎరువుల దుకాణాలలో గురువారం తహసీల్దారు ఏ నళిని, మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాలలో మందు కట్టల నిల్వలను పరిశీలించారు.

● ఈపూరు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కొచ్చెర్ల హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. పాఠశాలలోని 109మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా 18మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. వైద్య శిబిరంలో హెచ్‌ఎం వీ నాగేశ్వరరావు, ఆప్తాలమిక్ అధికారి గురుస్వామి,ఏఎన్‌ఎం సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రు మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి జనాబ్ మహబూబ్ సుభాని, చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారి శ్రీసత్యనారాయణ సింగ్ సందర్శించారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలోని వజ్జె లింగయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి మోటారుకు చెందిన విద్యుత్ తీగలను అపహరించారు. వీటి విలువ సుమారు రూ.6వేలు ఉంటుందని లింగయ్య తెలిపారు.

● నాదెండ్ల: మండలంలోని సంక్రాంతిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు టీడీపీ సీనియర్ నేత కొమ్మాలపాటి సాంబశివరావు క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. సుమారు రూ.12వేలు విలువైన ఈ సామగ్రిని హెచ్‌ఎం జానకీధరరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సాంబశివరావు, తోట శ్రీరాములు, విద్యా కమిటీ చైర్మన్ కె.పార్వతి, పీఈటీ హృదయరాజులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: మండలంలోని నీలగంగవరం సమీపంలోని తంగిరాల బీటు వద్ద గత 30సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను అకారణంగా తొలగిస్తున్నట్లు అధికారులు పదేపదే హెచ్చరించడంపై నీలగంగవరం వనసంరక్షణ సమితి సభ్యులు గురువారం జిల్లా ఫారెస్ట్ అధికారిణి హిమశైలజకు ఫిర్యాదు చేశారు. ఎవరిని తొలగించాలి, ఎవరిని ఉంచాలన్నది చట్టప్రకారమే చర్యలు తీసుకోవడం జరుగుతుందని వినుకొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి మాధవరావు ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు.


● రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సాల్మన్ రాజుకు చెందిన బైక్ చోరీకి గురైనట్లు రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం డిప్లొమా విద్యార్థుల ఫ్రెషర్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ లియో గ్లోబల్ ఓవర్సీస్ చీఫ్ రిలేషన్‌షిప్ మేనేజర్ గోగినేని అభి, ఈశ్వర్ కళాశాల పూర్వపు అల్యూమిని బ్యాచ్ తిరుమలశెట్టి అనిల్ హాజరయ్యారు.

● వినుకొండ: వినుకొండ శివయ్య భవన్‌లో సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్స్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొప్పవరపు మల్లికార్జున అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు పి.వెంకటేశ్వర్లు, ఊట్ల రామారావు, డి.మరియాబాబు, ఆర్. వందనం, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కోటప్పకొండ ఘాట్ రోడ్డు విస్తరణకు నిధులివ్వండి

మంత్రి జనార్దనరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వినతి



మంత్రి బీసీ జనార్దనరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి ఘాట్ రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన రెడ్డిని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వినతిపత్రం అందజేశారు. అమరావతిలోని మంత్రి బీసీ జనార్దనరెడ్డి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా, కోటప్పకొండ ఘాట్ రోడ్డు బలోపేతం, విస్తరణ కోసం సైడ్ సీసీ రోడ్డు కోసం 1 కోటి 80 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కోటప్పకొండ దిగువ నుంచి ఎగువ సన్నిధి వరకు 5కి.మీ. పొడవున ఉన్న ఘాట్‌రోడ్డు ప్రస్తుతం కంకరతో మధ్యంతర లేన్‌గా ఉందన్నారు. భారీ వర్షాల సమయంలో ఈ రోడ్డు తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. మంత్రి జనార్దన రెడ్డి ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తామని, రోడ్డు బలోపేతం పనులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మున్సిపాలిటీకి ఆగ్రోస్ పరికరాలు ఇవ్వండి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మున్సిపాలిటీకి ఆగ్రోస్ పరికరాలు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. గురువారం తాడేపల్లిలోని ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలపాటి సుబ్బరాయుడును కలిశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట మున్సిపాలిటిలోని పార్కులు, డివైడర్ల సమర్ధవంతమైన నిర్వహణ కోసం గడ్డి కట్టర్లు, చెట్లకోత యంత్రాలు వంటి అవసరమైన పరికరాలను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. మున్సిపాలిటీలో ఆరు పార్కులు, ఐదు కిలోమీటర్లు డివైడర్లు ఉన్నాయన్నారు. దీనిపై ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలపాటి సుబ్బనాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జ్ఞాన సరస్వతి ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులో ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ కమీటి సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

వినుకొండ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నాగిరెడ్డిపల్లి సమీపంలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు, సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లగడపాటి శ్రీనివాసరావు పాఠశాలకు 12 సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ బెన్ డిక్టా కృతజ్ఞతలు తెలియజేసి దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి యూనిట్ ఇన్‌చార్జి షేక్ జానీ, నూజెండ్ల మండలం తెలుగు యువత అధ్యక్షుడు వంకాయలపాటి కృష్ణ, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు బొట్లగుంట శ్రీనివాసరావు, తెలుగు యువత సంతోష్, గోల్కొండ జానీ బాష, అఖిల్, సుభానీ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: ఉపాధ్యాయ వృత్తికి అంకిత భావంతో పనిచేస్తే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వస్తాయని మండల విద్యా శాఖ అధికారి కంచర్ల పార్వతి గురువారం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన అవ్వారి రామ కోటేశ్వరరావు, చిలకల జ్ఞాన సుందర్, ఎంఈవో - 2 కంచర్ల పార్వతి, నాగేంద్రుడులను ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

● నరసరావుపేట రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట మండలం కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలో ప్రధానోపాధ్యాయులు గురులింగం, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని పాతూరులోని భవిత స్కూల్‌లో గురువారం నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు కే పద్మజ, జీ మేరీకుమారి, పొనుగంటి అర్జున్‌లను ఘనంగా సత్కరించారు. పిల్లలకు బుక్స్, డ్రాయింగ్ పెన్సిల్స్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కర్నాటి కృష్ణమూర్తి, జనసేన నాయకులు అద్దేపల్లి ఆనందబాబు, కృష్ణంశెట్టి గోవిందు, పోతంశెట్టి రాము, గుప్తా శ్రీకాంత్, హిందూ పరివార్ కన్వీనర్ కొత్తూరి వెంకట నరసింహరావు,జక్కా వెంకటేశ్వర్లు విద్యార్థులు, తల్లిదండ్రుల పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. శుక్రవారం సెలవు దినం కావటంతో ముందస్తుగా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. నూజెండ్ల జడ్పీ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఎంఈవోలు కే సత్యనారాయణ, ఎన్ రవిచంద్ర, ఎం సాంబశివరావు, హెచ్‌ఎం బీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో ఆదర్శ ఉపాధ్యాయుడు షేక్ యాసిన్‌ను పాఠశాల హెచ్‌ఎం ఘంటా నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు రవి, సూర్య ప్రకాష్, రామిరెడ్డి తదితరులు సత్కరించారు.



పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లను అందజేస్తున్న శ్రీనివాసరావు

● చిలకలూరిపేట: స్థానిక పండరీపురంలోని భారతరత్న ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం గేరా నాగేశ్వరరావు సీనియర్ ఉపాధ్యాయులు కొండపర్ల మేరీగ్రేస్, మర్రి స్వరూప రాణి, షేక్ మహమ్మద్ అలీలను ఘనంగా సత్కరించారు.

● చిలకలూరిపేట మండలం పసుమర్రు మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విశ్రాంత ప్రధానోపాధ్యాడు బొప్పుడి వెంకటేశ్వర్లు, సీనియర్ గణిత ఉపాధ్యాయులు నిడుమోలు శంకర్రావులను హెచ్‌ఎం యడవల్లి హనుమంతరావు సత్కరించారు.

వైభవంగా గణపతి నవరాత్రి పూజలు



మహావీర గణపతికి పీచుకొబ్బరి కాయలతో సహస్ర అష్టోత్తర పూజలు, ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మద్ది రాఘవయ్య బావి వీధి వద్ద టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటుచేసిన మహాకాళేశ్వర సహిత మహావీర గణపతికి తొమ్మిదో రోజు గురువారం 1108 పీచు కొబ్బరి కాయలతో సహస్ర అష్టోత్తర పూజ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి సుగంధ ద్రవ్యాలతో పంచామృతాలతో, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ వనమా పవన్ కుమార్, మహిళలు, భక్తులు, పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురవారం పట్టణంలోని సింధూ స్కూల్‌లో వినాయక మండప నిర్వాహకులకు అభినందన సభ జరిగింది. నియోజకవర్గంలో 400 వినాయకుడు మండపాలు ఏర్పాటు చేశారు. వినాయుడు మండపాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను శివస్వామి సత్కరించారు. కార్యక్రమంలో సింధు స్కూల్ అధినేత రామకృష్ణ, శాఖమూరి బాబిబాబు, కాకుమాను మంగపతి రెడ్డి, బత్తుల మురళి, కొండకావూరి ఉమామహేశ్వర శర్మ, సీతారాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొనకంచివారిపాలెం రామాలయం వద్ద ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను వీర్ల మస్తాన్‌రావు రూ.50వేలకు వేలంలో దక్కించుకున్నాడు. ట్రాక్టర్‌పై వినాయకుని విగ్రహ నిమజ్జనానికి తీసుకు వెళ్ళేందుకు పొనుగోటి సహదేవుడు రూ.15వేలకు, కలశాన్ని పొనుగోటి ఏడుకొండలు రూ.24వేలకు వేలంలో దక్కించుకున్నారు. రొంపిచర్లలోని ఎస్‌బీఐ వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద బుధవారం రాత్రి కోలాటం నిర్వహించారు. ఆరేపల్లిలో గణనాథుని వద్ద ఉంచిన లడ్డూను రూ.1.10 లక్షలకు తమ్మిశెట్టి రామారావు, వీరాంజి, శంకర్‌లు దక్కించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని బత్తుల దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కొనకంచివారిపాలెంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. గురువారం ఆరేపల్లి, కనకంచివారిపాలెం గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు జరిగాయి.



వినాయక మండప నిర్వాహకులను అభినందిస్తున్న శివస్వామి తదితరులు

● వినుకొండ: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ బజారులో గత నెల 27వ తేదీన ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి సుమారు రూ.65లక్షల కరెన్సీతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని భక్తులు పెద్దసంఖ్యలో స్టేట్‌బ్యాంక్ బజారులోని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని జీడీసీసీ బ్యాంక్ మక్కెన మల్లికార్జునరావు ప్రారంభించారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని కొండ మెట్ల వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి ఉత్సవాలు 9వ రోజు ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 40 దంపతులచే నవగ్రహ, లక్ష్మీ, గణపతి హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరూరి శ్రీనివాసరావు, పువ్వాడ సుబ్రహ్మణ్యం, అరవింద్, గుమ్మడి సదాశివరావు, చక్రధర్‌లు, భక్తులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని పాలపాడు రోడ్డు ప్రశాంతి నగర్‌లో ఉన్న చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, సువర్చల ప్రసన్నాంజనేయ మన్యసూత హోమం నిర్వంచారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా నిమజ్జనంకు తరలించారు.

● కారుమంచి (శావల్యాపురం): మండలంలోని కారుమంచి గ్రామంలోని లైబ్రరీ సెంటర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మక్కెన ఆదినారాయణ రూ.1.50లక్షలకు స్వామివారి లడ్డూను దక్కించుకొన్నారు.

నిమజ్జనంలో ఉద్రిక్తత

లైబ్రరీ సెంటర్‌లో గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం నిమజ్జన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకొంది. వినాయక విగ్రహాన్ని గురువారం రాత్రి గ్రామంలో ఊరేగించే క్రమంలో సత్రం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహంవద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాళ్ళదాడికి పాల్పడ్డారు. దీనిపై వైసీపీకి చెందిన వేముల శ్రీకాంత్‌ను ప్రశ్నించటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. టీడీపీ నాయకుడు ముప్పా సురేష్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు ఇరువర్గాలను వారించి అక్కడి నుంచి పంపించి వేశారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

క్లుప్తంగా...

● శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఎస్టీయూ సంఘం ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. స్థానిక జడ్పీపాఠశాల్లో ఎస్టీయూ రూపొందించిన ఉపాధ్యాయుల సెలవు దరకాస్తుల పుస్తకాలను ఎస్టీయూ మండల కమిటీసభ్యులతో కలసి ఆమె గురువారం ఆవిష్కరించారు.

● వినుకొండ: మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై గురువారం చర్చించారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన పలు సూచనల మేరకు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, తహసీల్దార్ సురేష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: పల్నాడు జిల్లా ఇన్‌చార్జి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, కో-కన్వీనర్ గుండాల నగేష్‌ల ఆధ్వర్యంలో వినుకొండ నియోజకవర్గం ఎంఆర్పీఎస్ నూతన కార్యవర్గసభ్యుల ఎన్నికలను శావల్యాపురంలో గురువారం నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా శానంపూడి గ్రామానికి చెందిన కల్పుకూరి ఏసురత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జిగా పచ్చిగొర్ల సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● నూజెండ్ల: సమిత్వ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. గురువారం మండలంలోని ఐనవోలు, తలార్లపల్లి, ముక్కెళ్ళపాడు, పమిడిపాడు, వీ అప్పాపురం, ఉప్పలపాడు, తిమ్మాపురం గ్రామాల్లో జరుగుతున్న సమిత్ర పనులను పరిశీలించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే సమిత్వ విజయవంత మవుతుందని ఎంపీడీవో తెలిపారు.

● నరసరావుపేట రూరల్: నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో ఉల్లిపాయ విక్రయ కేంద్రాన్ని గురువారం యార్డు చైర్మన్ పోనాటి శ్రీనివాసరావు, జిల్లా అధికారి ఉపేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా పోనాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కర్నూల్ జిల్లా ఉల్లి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉల్లిపాయ అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు.

● నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలు, జీడీసీఎంఎస్ షాపులను గోడౌన్లను జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు నరసరావుపేట కెవి శ్రీనివాసరావు మండల వ్యవసాయ అధికారి ఐశాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● పిచికలపాలెం (శావల్యాపురం): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని లింక్ వర్కర్ స్కీం జోనల్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రాజెక్ట్ ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్-2025లో భాగంగా మండలంలోని పిచికలపాలెం గ్రామ సచివాలయంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు సంబందించిన పోస్టర్‌లను ఆవిష్కరించి అనంతరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గణపర్తి ఆంజనేయులు, కార్యదర్శి ప్రసాద్‌కుమార్, ఏఎన్‌ఎం నర్సమ్మ, ఆశా వర్కర్లు సుబ్బమ్మ, లక్ష్మీదేవి, లింక్ వర్కర్ శైలజ పాల్గొన్నారు.

భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

● కలెక్టరుకు యడవల్లి రైతుల వినతి

చిలకలూరిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తమ భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత, గిరిజన రైతులు గురువారం కలెక్టరు కార్యాలయంలో కలెక్టరును కలిసి కోరారు. ఇందుకు సంబంధించి రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యడవల్లి గ్రామంలో 1975లో ప్రభుత్వం 120 దళిత, గిరిజన కుటుంబాలకు 416 ఎకరాలు భూమిని అసైన్డ్ చేసింది. ఆ బీడు భూములను సాగులోకి తెచ్చామన్నారు. ఆ భూముల్లో గ్రానైట్ రాయి ఉండటంతో 2021లో ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకున్నది. 120 మంది లబ్ధిదారులకు గాను ప్రస్తుతం ఉన్న వారి వారసులు 244 మందిగా ప్రభుత్వం గుర్తించి వారందరికీ ఎకరానికి రూ.8.33 లక్షలు పరిహారంగా చెల్లించారు. అయితే అప్పటి నుంచి రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని రైతులు హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. విచారణ అనంతరం విషయాన్ని పరిశీలించి మూడు వారాలలోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా కలెక్టరును కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.పెద్దిరాజు, వి.వెంకటస్వామి, యడవల్లి రైతులు సుభాషిణి, రాణి, ఏసమ్మ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.

కాసు మహేష్ రెడ్డిపై పెట్టిన కేసును ఉపసంహరించాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసులు వైసీపీ నాయకులపై అన్యాయంగా పెడుతున్న కేసుల వ్యవహారం తీవ్రస్థాయికి చేరిందన్నారు. ఇది సమాజానికి మంచిది కాదని పోలీసులకు హితవు పలికారు. సాక్షి మీడియా ఎడిటర్ ధనుంజయ రెడ్డి మీద, సంతగుడిపాడు గ్రామంలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో టీడీపీకి చెందిన ఒక వ్యక్తిపై కుంకుమ పడిందని ఫిర్యాదు ఇస్తే ఎనిమిది మంది వైసీపీ కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించారన్నారు. వైసీపీ నాయకుడు వరవకట్ట బుజ్జి జన్మదినం సందర్భంగా రహదారిపై కేక్ కట్‌చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని 16మందిపై కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



డంపింగ్‌యార్డులో నివాసం ఉంటున్న వారికి నమస్తే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్

'నమస్తే' కార్యక్రమంపై అవగాహన

వినుకొండ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ గురువారం డంపింగ్‌యార్డును సందర్శించారు. చెత్తను ఏరుకొని జీవనం సాగిస్తున్న కుటుంబాలకు, యూనియన్ గవర్నమెంట్, కేంద్ర సామాజిక న్యాయశాఖ, పట్టణ అభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ సమ్మిళితంగా చేపట్టిన నమస్తే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు సమీపంలో నివాసం ఉంటున్న పలు కుటుంబాలతో ఆయన మాట్లాడుతూ అందరూ ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకొని, సామాజిక న్యాయం, గౌరవం, భద్రత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో పేరు నమోదు చేసుకోవాలి అని సూచించారు.

అంతర్ పంటల విధానంతో అధిక లాభాలు

● డీపీఎం అమల కుమారి

నాదెండ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక లాభాలు పొందాలంటే తప్పనిసరిగా అంతర్ పంట విధానం పాటించాలని డీపీఎం అమల కుమారి అన్నారు. చిరుమామిళ్ళ గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి ఏ గ్రేడు మోడల్ కింద పత్తితో పాటు సజ్జ, గోరుచిక్కుడు, పెసలు, వంగ, బెండ, టమోటావంటి పంటలను సాగుచేయటం ద్వారా అత్యధిక ఆదాయం పొందవచ్చన్నారు. కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం రైతులు సాధిస్తారన్నారు. భవనం శ్రీనివాసరెడ్డి, మహిళా రైతు పసన్నలక్ష్మి పొలాలను పరిశీలించారు. ఆమెతో పాటు ఏవో శ్రీలత, అధికారులు అరుణ, సైదయ్య, సౌజన్య పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా డాక్టర్ పద్మ

వినుకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని డాక్టర్ వి.పద్మ పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. వినుకొండ పట్టణానికి చెందిన డాక్టర్ వి. పద్మ 20 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఉద్యోగం చేస్తూనే తెలుగు సాహిత్యంలో పరిశోధన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి గత ఏప్రిల్ లో డాక్టరేట్ సాధించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన పద్మను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీశైలజ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యు. చంద్రజిత్ యాదవ్, శావల్యాపురం మండల నాయకులు బిల్లా రాజారమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పూర్తిస్థాయిలో వినియోగంలోకి గోదాములు

● యార్డు తొలి సమావేశంలో నిర్ణయం

చిలకలూరిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలోని పాత, కొత్త మార్కెట్ యార్డులలో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని గురువారం చైర్మన్ షేక్ కరిముల్లా అధ్యక్షతన జరిగిన మార్కెట్ యార్డు కొత్త పాలకవర్గం తొలి సమావేశంలో నిర్ణయించారు. చైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఈ క్రాప్ నమోదు పూర్తి స్థాయిలో జరిగేటట్లుగా రైతులను చైతన్యవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో అధికారులు ఈ క్రాప్ నమోదు విషయంలో పూర్తిస్థాయిలో రైతులకు సహకారం అందించాలని కోరారు. పంట పొలాలకు వెళ్లే పలు డొంక రోడ్లను అభివృద్ధి చేయాలని, వాటికి సంబంధించిన వివరాలను యార్డు డైరెక్టర్లు అందచేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను యార్డు పాలకవర్గాలు గాలికి వదిలేశాయని, నాటి తప్పులను సరిచేసి, రైతులకు యార్డు ద్వారా అందే ప్రతి ప్రయోజనాన్ని పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు డైరెక్టర్లు సూచించారు. వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, యార్డు కార్యదర్శి రాయుడు, డైరెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.